

# శుభవాస్తు


సుద్దాల సుధాకర్ తేజ
suddalavasthu@gmail.com
Cell: 7993467678




**ఇంట్లో వాస్తుపూజ ఎందుకు చేయాలి? దాని ఫలం ఏమిటి?**

**- సీతారామ్,** ఆమనగల్లు



వాసుదేవుడే.. వాస్తు దేవుడని పెద్దలు చెబుతుంటారు. అందుకే.. 'ఓం నమో భగవతే వాస్తు పురుషాయ| మహా బలపరాక్రమాయ||' అని కొలుస్తారు. ఒక నిర్మాణం పూర్తిచేశాం అంటే.. దానికి ఒక భౌతిక రూపం వస్తుంది. అది గృహం, గుడిసె, గుడి, ఆఫీస్.. ఏదైనా సరే, దానిలో పంచభూతాలు నియమబద్ధంగా నివాసం చేస్తుంటాయి. అంటే.. పంచభూతాత్మక ప్రాణ మందిరం అవుతుంది. దానికి ఒక శక్తి ఏర్పడుతుంది. అది పూజనీయం అవుతుంది. అందుకు గృహప్రవేశం చేసేటప్పుడు ఆ చోట వాస్తు మండలం వేసి, శక్తిని (వాస్తు పురుషుణ్ని) ఆవాహన చేసి పూజిస్తారు. తద్వారా ఆ ప్రాంగణం మంత్రబద్ధంగా, పూజాపరంగా.. పాజిటివ్ ఎనర్జీని నింపుకొంటుంది. ప్రకృతితో అనుసంధానం అవుతుంది. ఆకారం కలిగిన ఏదైనా.. శక్తిగలదే! అది ఒక ప్రమాణంతో, కొలతతో, శాస్త్ర సూత్రాలతో నిర్మితమై చాలా శక్తిమంతం అవుతుంది. పూజ ద్వారా ఆమోదయోగ్యత వస్తుంది. అది ప్రకృతి నియమం. లైసెన్స్ లేకున్నా.. బైక్ నడుస్తుంది. కానీ, లైసెన్స్ అనేది చట్టం కదా! ఇదీ అంతే. ఆఆమోదయోగ్యత.. సృష్టి నుంచే అందుకోవాలి.



**మూడు అంతస్తుల ఇల్లు కట్టాలి. అన్నీ ఒక కొలత లోనే ఉండేలా గదులు తగ్గించి కట్టుకోవచ్చా?**

**- బి. చంద్రశేఖర్,** కరీంనగర్

ప్రతి ఫ్లోర్ మన అవసరానికి తగిన విధంగా నిర్మించుకునే అవకాశం ఉంటుంది. ఏ ఫ్లోర్‌కి ఆ ఫ్లోర్ వేరు చేసి కట్టాలన్నా.. ఒక్కో అంతస్తు వెనక్కి జరిపి కట్టాలన్నా.. మెట్లు ఎలా డిజైన్ చేస్తున్నారు అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. బయటివైపు మెట్లు పెట్టి, ఈ విధంగా ఫ్లోర్‌వైజ్ కొలతలు మార్చి ఇల్లు తగ్గించి కట్టుకోవచ్చు. అలా కాకుండా, డూప్లెక్స్ ఇల్లు కట్టి.. మన ఇష్టం వచ్చినట్టు వెనక్కి జరుపుతూ ఇల్లు కట్టవద్దు. అలాగే సగం డూప్లెక్స్ ఇల్లు, సగం వేరు చేసి కట్టాలంటే.. మెట్లు విడిగా ఉండాలి. ఆగ్నేయం లేదా వాయవ్యం మెట్లు నిర్మించి.. కింది రెండు ఫ్లోర్లు వదిలి, పై నిర్మాణాలు అంతస్తుల వారీగా అవసరమైనట్టు కట్టవచ్చు. కింది రెండు ఫ్లోర్లు డూప్లెక్స్ చేసుకోవచ్చు. పై భాగంలోని నిర్మాణాలు ఎంత విడిగా కట్టినా.. గదులు 'ఎల్' ఆకారంలో, 'యూ' ఆకారంలో మాత్రం కట్టకూడదు. అన్నీ తెలుసుకొని కట్టండి. శాస్త్రంలో ఎన్నో వెసులుబాట్లు ఉంటాయి.

**వరుసగా మూడు ద్వారాలు ఉండకూడదా?**

**- జి. శ్రీహరి,** కోరుట్ల



శాస్త్ర ప్రకారం ఇల్లు కడితే.. ఎదురెదురు ద్వారాలు వస్తాయి కానీ, ఎక్కువ శాతం వరుసగా మూడు ద్వారాలు రావు. తూర్పు వీధి ఉన్న ఇంటికి ఈశాన్యంలో డ్రాయింగ్ రూమ్ వస్తుంది. దానికి ఎదురుగా తూర్పులో ప్రధాన సింహద్వారం. దానికి పడమర ఒక ఆర్చి, ఆర్చికి పడమర వైపు వాయవ్యం బెడ్‌రూమ్ డోర్, దానికి పడమరలో ఒక ద్వారం. ఇలా తూర్పు నుంచి పడమరకు నాలుగు భాగాలు దాటి నడుస్తూ ఉంటాం. తద్వారా దోషం లేదు సరికదా.. ఉచ్ఛమైన నడకలతో గృహం సిద్ధి పొందుతుంది. ఆర్చి భాగాన్ని కూడా ద్వారబంధంగానే గుర్తించాలి. ఉత్తరం సింహద్వారం నుంచి కూడా డ్రాయింగ్ రూమ్ ఆర్చి, అలాగే వంటగది ద్వారం, వంటగదికి పెట్టే దక్షిణ ద్వారం.. ఇలా ఉత్తరం నుంచి దక్షిణానికి వరుసగా నడకను లెక్కించినా.. నాలుగు గుమ్మాలు దాటుతారు. ఇందులో ఆర్చిలు, ద్వారాలు అన్నీ గణించినట్లు మరువకూడదు. ఇంటిని సశాస్త్రీయంగా నిర్మించకపోతే మీరు అనుకున్నట్టు మూడు ద్వారాలు వస్తాయేమో! అయినా, వాస్తు ప్రకారం ఉంటే.. మొత్తం ఇంటి ద్వారాలు సరి సంఖ్యలో ఉన్నా దోషం ఉండదు. అన్ని విధాలుగా తెలిసిన వారిచేత సూచనలు తీసుకోండి. మీకు మీరుగా ప్లానువేసి ఇల్లు కట్టుకోకండి. ఇంటికైనా.. వంటికైనా.. సొంతవైద్యం పనికిరాదు.

**మనిషిని బట్టి భూమిని కొనాలా? ఎన్ని గజాలు ఉండాలి? ఇంటికి కొలతలు పాటించాలా?**

**- ఎన్. భరత్,** కందుకూరు

ఎవరు ఏ స్థలమైనా కొనుక్కోవచ్చు. ఇల్లు కట్టే స్థలం ఉంటే.. అది ఆమోదమే! ఇల్లు కట్టుకోవడానికి గజాలను లెక్కించాల్సిన అవసరం లేదు. భూమి ఏదైనా భూమే అని మీరు అనుకుంటారు. అలాగని అన్ని స్థలాలూ నివాసయోగ్యత కలిగినవిగా ఉండవు. చిన్న – పెద్ద స్థలం కాదు ప్రధానం. ఆ భూమి యోగ్యతలే ముఖ్యం. మనిషి – మనిషికి వేరువేరు భూములు లేవు కానీ, ప్రతి మనిషికీ పనికొచ్చే భూమి అవసరమే! చిన్న గుడిసెల్లో మహాత్ములు నివసించి.. మానవాళి శాంతికి మహా శాస్త్రాలు అందించారు. అర్హత చూసుకొని చిన్న ఇల్లు అయినా, పెద్ద ఇల్లు అయినా కట్టుకోవచ్చు. క్వాంటిటీ కాదు.. క్వాలిటీ ముఖ్యం.

**మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా**

'బతుకమ్మ', నమస్తే తెలంగాణ దినపత్రిక,
ఇంటి.నం: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం.
రోడ్ నం: 10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034.